క్లుప్తంగా

నవోదయలో సీటు సాధించిన విద్యార్థి


రిషిత్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రగతి విద్యా నిలయంలో ఐదో తరగతి చదువుతున్న ఈరవెన్ను గ్రామానికి చెందిన అనుముల రిషిత్ నవోదయకు ఎంపిక అయినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వీరమానేని వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మామునూరులో జవహర్ నవోదయ పాఠశాలలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రిషిత్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

జనగామ: వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని టీజేయూ జిల్లా అధ్యక్షుడు బూస రమేష్‌యాదవ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంచికట్ల రాజేష్, కుంభం రమేష్, సాంబయ్య, మహేందర్, రాజు, అప్రోచ్, నవీన్ తదితరులు ఉన్నారు.

'కక్షసాధింపు చర్యలకు తావులేదు'


మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

దేవరుప్పుల: ప్రజా ఉద్యమాల గడ్డ పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ కక్షసాధింపు చర్యలకు తావులేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలన నచ్చక ప్రజామార్పులో అనివార్యంగా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడితే ఎమ్మెల్యేగా గెలిచిన హనుమాండ్ల కుటుంబం విస్నూర్ దేశ్‌ముఖ్‌ల పాలనను పునరావృతం చేస్తున్నారని ఆరోపించారు. గడిచిన ఎడాదిన్న కాలంలో ప్రతిపక్షాలపై పార్టీ ఇంచార్జీగా కొనసాగుతున్న ఝాన్సీరెడ్డి ప్రతిపక్ష పార్టీల నేతలతో సహా మీడియా, కాంగ్రెస్ అసంతృప్తులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు, దుశ్చర్యలకు పాల్పడం తగదన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మండల అధ్యక్షుడు బస్వ భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


బైండోవర్ అయిన ఇసుక రవాణాదారులు

బచ్చన్నపేట: అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని... అప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని తహసీల్దార్ ఫణికిషోర్ అన్నారు. సోమవారం ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ మండల కేంద్రానికి చెందిన 11 మంది అక్రమ ఇసుక రవాణా దారులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వారందరి చేత అగ్రిమెంట్ బాండ్ రాయించుకుని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇక నుంచి అగ్రిమెంట్ రాసి ఇచ్చిన వారు ఎలాంటి తప్పు చేసినా.. వారు ఒప్పంద జరిమానా చెల్లించాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేయకూడదని సూచించారు. కానిస్టేబుళ్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నిక


సాయిబాబాను సన్మానిస్తున్న నాయకులు

బచ్చన్నపేట: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అడ్‌హక్ కమిటీ మండల అధ్యక్షుడిగా జంగిలి సాయిబాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల జగన్, జిల్లా అధ్యక్షులు నీల నరేష్‌బాబు, కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, కోశాధికారి కూచన సుప్రీం, ఉపాధ్యక్షులు చింతల మధుకృష్ణలు పాల్గొని కమిటీని ప్రకటించారు. మండల ప్రధాన కార్యదర్శిగా చింతల రాజిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా వనమైన వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కోడూరి కార్తీక్, పులి రాజు, కోశాధికారిగా మినుకూరి లక్ష్మణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు నీల పవన్, అల్వాల రాజు, సభ్యులు వెంకన్న, కర్ణాకర్, సంపత్, అరుణ్‌కుమార్‌లను నియమించారు. మంగ శంకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కిందనే భోజనాలు

- మాటలకే పరిమితమవుతున్న వసతి భవన నిర్మాణం


చెట్లకింద భోజనాలు చేస్తున్న అటెండెంట్లు

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో కనీస వసతి సౌకర్యాలు కరువయ్యాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల చెకప్ కోసం వచ్చే సహాయకుల కోసం విశ్రాంతి గది నిర్మాణం చేస్తామని ఏడేళ్లుగా చెబుతున్నారు. ఎంసీహెచ్‌కు రోజు వారీగా 300 మంది వరకు చెకప్ కోసం వస్తుండగా, 15 నుంచి 20 వరకు ప్రసూతి కాన్పులు చేస్తున్నారు. అడ్మిషన్‌ల విషయానికి వస్తే ప్రతీరోజు 50 వరకు ఉంటాయి. జనరల్ వార్డులో వీరి వెంట ఒక్కరిని మాత్రమే ఉండే అవకాశం నేపథ్యంలో మిగతా వారు బయట ఉండాల్సిన పరిస్థితి. వారం నుంచి పది రోజుల వరకు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తే.. వంటావార్పు అక్కడే చేసుకుంటారు. ఎంసీహెచ్ ప్రాంగణంలో విశ్రాంతి గది లేకపోవడంతో సహాయకులు వానొచ్చినా, ఎండ కొట్టినా ఆరుబయటనే ఉంటున్నారు. ఓపీ సమయంలో వేచి ఉండేందుకు ఎంసీహెచ్ డాక్టర్ గదులకు ఎదురుగా గర్భిణులు, బాలింతలు వేచి ఉంటారు. పైనుంచి వచ్చే ఎండతో పాటు ఉష్ణోగ్రతలతో వారు డీ హైడ్రేషన్‌కు గురవుతున్నారు. తెల్లటి ఫైబర్‌తో పైకప్పు నిర్మాణం చేయడంతో అందులో నుంచి ఎండ నేరుగా బాలింతలు, గర్భిణులపై పడుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా.. ఫలితం లేకుండాపోయింది. ఎంసీహెచ్‌లో మౌలిక వసతి సౌకర్యాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు, బాలింతలు


మాతా, శిశు సంరక్షణ కేంద్రం

పాఠశాల గోడలకు పెయింటింగ్‌లు


గోడకు బొమ్మలు వేయిస్తున్న పూర్వవిద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గోడలకు పూర్వ విద్యార్థి యాట సాంబరాజు స్మారకార్థం 2009–10 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు బొమ్మలతో కూడిన పెయింటింగ్‌లను సోమవారం వేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సాంబరాజు స్మారకార్థం పెయింటింగ్‌లు వేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నర్మెట: మండలకేంద్రంలోని అతి పురాతన హనుమాన్ దేవాలయంలో వేదపండితులచే ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రాతః కాలం గణపతి పూజతో ప్రారంభమైన కార్యక్రమాలు తీర్థ ప్రసాద, మహాన్న ప్రసాద వితరణలతో సాయంకాలం ముగిశాయి. మంగళ తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయాలలో పుణ్యాహవాచనం, మండప ఆవాహిత దేవతా పూజలు, రామ చతుష్టయనం, శివ పంచాయతనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, వీరాంజనేయ స్వామికి చందన లేపిత ఫల పత్ర పూజలు, నవగ్రహమూర్తులకు అభిషేకాలు, ఉత్సవిగ్రహాలకు నూతన వస్త్రాలంకరణలు, స్థాపిత దేవతా హోమం, బలిప్రదానం, పూర్ణాహుతి, కలశార్చనలతో పండితులు క్రతువును పూర్తిచేయగా మొక్కులు సమర్పించిన భక్తులు తీర్థ ప్రదాలు స్వీకరించారు. పండితులు దేశపతి లలితామతి శర్మ (చుంచకోట పీఠాధిపతి), గౌరీభట్ల నాగరాజ శర్మ, పార్నంది సీతారామ శర్మ, ప్రయాగ నాగభూషణ శర్మ, పోకల నాగేంద్ర శర్మ క్రతువులను నిర్వహించారు. ఆలయ కమిటీ జోగిపర్తి ఉపేందర్, కవిత, జంగిటి అంజయ్య లలిత, బిజ్జ సత్యనారాయణ సంధ్య, మహేశ్వరం మురళి అనిత, ఆమెడపు లక్ష్మయ్య నీలమ్మ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత


రేణుకకు బ్యాగు అప్పగిస్తున్న కండక్టర్, అధికారులు

పాలకుర్తి టౌన్: జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులో ఓ మహిళ ప్రయాణికురాలు మర్చిపోయిన బంగారం, వెండి అభరణ వస్తువులు, నగదు ఉన్న బ్యాగను గంటల వ్యవధిలోనే గుర్తించి ప్రయాణికురాలుకు అప్పగించి నిజాయతీ చాడుకున్నాడు ఆర్టీసీ కండక్టర్. పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన చెందిన మహిళ గుగ్గిళ్ల రేణుక తన తల్లిగారి ఊరినుండి లింగాల ఘనపూర్ మండలం నేలపొగులకు అత్తగారి ఇంటికి వెళ్తు పాలకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో జనగామ వైపు వెళ్తున్న పల్లెవెలుగు బస్సు ఎక్కింది. నేలపోగుల వద్ద బస్సు దిగిన తర్వాతా బ్యాగు మర్చిపోయినట్లు గుర్తించింది. బ్యాగులో విలువైన బంగారం, వెండి అభరణాలు,నదు ఉండడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. వెంటనే మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపకుడు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంట రవీందర్‌కు సమాచరం ఇచ్చింది. ఆయన వెంటనే జనగామ ఆర్టీసీ డిపో అధికారికి విషయం తెపడంతో వారు వెంటనే స్పందించారు. బస్సులో ఉన్న కండక్టర్ పొన్నాల రమేష్ అప్రమత్తమైన తనిఖీ చేయగా బ్యాగు బస్సులో లభ్యమైంది. డిపోలోని సెక్యూరిటీ అధికారుల సమక్షంలో రేణుక కు బ్యాగు అందజేశారు. బస్సులో మర్చి పోయిన బ్యాగును తిరిగి అప్పగించినందుకు ఆర్టీసీ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటనపై ప్రయాణికులు ఆర్టీసీ నిబద్ధతను ప్రశంసించారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులు చేర్పించాలన్నారు. పిల్లలకు అక్షరాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు సీహెచ్ విజయలక్ష్మి, రాజమ్మ, జరీనబేగం ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


జనగామ: ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


నర్మెట: శ్యాం ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చిల్పూరులో..


తరిగొప్పులలో..

జనగామ/తరిగొప్పుల/నర్మెట/బచ్చన్నపేట/చిల్పూరు/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా బీజేపీ దాని అనుబంధసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయ వాదమే పునాదిగా, సనాతన ధర్మ రక్షణే ధ్యేయంగా భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి, ఏక్ దేశమే ఏక్‌విధాన్, ఏక్‌ప్రధాన్, ఏక్ నిషాన్ మాత్రమే ఉండాలని దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన దైర్యశాలి, త్యాగశీలి ముఖర్జీని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, లేగ రాంమోహన్‌రెడ్డి, నాయకులు పిడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, దేవర ఎల్లయ్య, బొమ్మకంటి అనిల్పస్వా భాస్కర్ గౌడ్, పన్నీరు రాజు, సృజన్, నరసింహచారీ, ధరావత్ రాజు, ధరావత్ నరేష్, బొల్లం అవినాష్, సద్ది సోమిరెడ్డి, బంగారు మహేష్, రాపెల్లి చక్రపాణి, రాంనర్సింహారెడ్డి, పబ్బోజు రాంబ్రహ్మం, వెలిశాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాతృత్వం.. మాధుర్యం


పిల్లికి పాలు ఇస్తున్న శునకం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో అరుదైన దృశ్యం ప్రజల మనస్సును తాకింది. ఓ శునకం ... పిల్లికి పాలు ఇస్తూ ప్రేమను పంచిన తీరు ఆశ్చర్యపరిచింది. జీవజాతుల మధ్య ద్వేషం లేదు.. మానవ సమాజానికి ఇదొక గొప్ప సందేశమని పలువురు పేర్కొన్నారు. పిల్లికి శునకం పాలు ఇస్తూ మాతృత్వ మాధుర్యం చాటింది.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


మొక్కలు నాటుతున్న సీఐ అబ్బయ్య, విద్యార్థులు

బచ్చన్నపేట: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నర్మెట సీఐ అబ్బయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మొక్కలను నాటి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారికి మంచి పేరు తీసుకొచ్చేందుకు పాటుపడాలని సూచించారు. ప్రిన్సిపల్ భారతిదేవి, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రీడింగ్ కుర్చీల బహూకరణ


కుర్చీలతో పాఠకులు

నర్మెట: ఆకస్మిక తనిఖీలో భాగంగా మండలకేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాజోడు రాంబాబు విచ్చేశారు. ఈసందర్భంగా రీడింగ్ కుర్చీల ఆవశ్యకతను పలువురు పాఠకులు ఆయన దృష్టికి తెచ్చారు. కాగా, సోమవారం ఆయన సొంత ఖర్చులతో ఐదు కుర్చీలను కొనుగోలు చేసి పంపించినట్లు శాఖ నిర్వాహకుడు బండి రమేశ్ తెలిపారు. పాఠకులు ఎలగొండ సునీత, బైరోజు శ్యామల, ఉప్పుగల్ల ఉపేందర్, జంగిటి అశ్విని, జంగిటి ప్రణవి ఈ సందర్భంగా దన్యవాదములు తెలిపారు. పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పాలకుర్తి: పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమతో చదువుకుని భర్త, కుమారుడిని కోల్పోయిన శనిగరపు వెంకటలక్ష్మికి రూ. 50 వేల సాయం అందజేశారు. సోమవారం పూర్వవిద్యార్థులు వెంకటలక్ష్మిని పరామర్శించి సాయం అందజేశారు. పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన పసుల తిరుపతి మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ సోమవారం పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు. భిక్షపతి, ఇస్తారి, శ్రీనివాస రమేష్, వెంకటేశం, నర్సయ్య, సిద్దులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ బాధిత కుటుంబానికి రూ. 5వేలు అందించారు.

పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట: ఇటీవల ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే పల్లా ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ యూత్‌నాయకులు సంపత్, సాయిచరణ్‌రెడ్డి, లవన్, అశోక్, మహేష్ తదితరులు ఉన్నారు. అలాగే బచ్చన్నపేట మండల నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, నాగిళ్ల తిరుమల్‌రెడ్డిలు కూడా పల్లాను పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

పీఆర్‌ఓ కుటుంబానికి..



కొడకండ్ల: వాహనం ఢీకొని గాయపడిన తన వ్యక్తిగత సోషల్ మీడియా పీఆర్‌ఓ ప్రశాంత్ తల్లి సోమలక్ష్మిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. గాయపడిన విషయం తెలుసుకున్న దయాకర్‌రావు సోమవారం మొండ్రాయిలోని వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నాడు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, కనకయ్య, రణధీర్ ఉన్నారు.

శ్రేణులకు అండగా ఉంటా..

దేవరుప్పుల: అధికారం పరమావధిగా కాకుండా పార్టీ కోసం పాటుపడే బీఆర్ఎస్ కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం నీర్మాలలో సీనియర్ నాయకుడు బండ రవీందర్‌రెడ్డికి మాతృవియోగం జరుగగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని కోలుకొండ, ధర్మపురం, దేవరుప్పుల, సీతారాంపురం, పెద్దమడూరు, సింగరాజుపల్లి తదితర గ్రామాల్లో పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉద్దేశ్యపూర్వకంగానే కుట్ర

జనగామ రూరల్: జర్నలిస్టు మరెడి వినయ్‌కుమార్ ఉద్దేశ్యపూర్వకంగానే నాపై కుట్రలు పన్నుతున్నారని జాయ మల్లేష్ కురుమ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వినయ్‌కుమార్ కావాలని నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. వినయ్‌కుమార్‌కు నాకు ఎలాంటి సంబంధం కూడా లేదన్నారు. రాజకీయ ఎదుగులను చూసి ఓర్వలేక రాజకీయ కుట్రలో భాగంగా కేసును మళ్లించారని, దీనిని ఖండిస్తున్నట్లు మల్లేష్ చెప్పారు.

ముఖ్యమంత్రికి విద్యార్థుల ధన్యవాదాలు



నర్మెట: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. దీంతో మండలంలోని మాన్‌సింగ్‌తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి బాధాకరం

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి మాజీ సర్పంచ్ గుర్రం దేవయ్య మృతి బాధాకరమని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు పోశాల కృష్ణమూర్తి, చిగురు విజయ్‌కుమార్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు నీరటి ప్రభాకర్, చింత దానయ్య, ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా నాయకుడు మొగ్దుంపురం కిషోర్‌కుమార్ అన్నారు. దేవయ్య అకాల మృతిచెందిన విషయం తెలుసుకున్న వారు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి టౌన్: వావిలాల గ్రామానికి చెందిన పొన్నాల అజెయ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం పాలకుర్తి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసరాలను ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

జనగామ రూరల్: పెంబర్తి హైవే రోడ్డు పక్కన ఉన్న వైన్ షాపులో దొంగతనం జరిగిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో వైన్ షాపులో ఉన్న 20 వేలనగదు మందు బాటిల్ దొంగతనం చేశాడు. కాగా, యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరా ఆధారంగా నిందితులను గుర్తించనున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాలపై పోరాటమే ఎకైక మార్గమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సొప్పరి సోమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జూలై 4వ తేదీన కడవెండిలో తలపెట్టిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాకంటక పాలన కొనసాగించే పాలకవర్గాలకు గుణపాఠం చెప్పేలా ప్రత్యామ్నాయ పాలకవర్గాలకు వామపక్షభావజాల శక్తులం మద్దతు పలికినా ఆచరణాత్మకంగా తాము ప్రజాపోరాటమే ఎజెండాగా పనిచేయడం అనివార్యమన్నారు. సీపీఐ అనుబంధ రైతు సంఘం జిల్లా నాయకుడు తిరుపతి రెడి, సీపీఐ మండల కార్యదర్శి ఎల్లయ్య పాల్గొన్నారు.